


నల్లగొండ సత్యనిష్ఠ

నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి

10 మంగళవారం నవంబర్ 2026 పేజీలు: 3

చెరువు నిండటంతో గ్రామ ప్రజల్లో సంతోషం

- భూగర్భ జలాల పెంపుకు చెరువులు నింపిన ప్రభుత్వం
- చెరువు నీటిని కాపాడాలని నందుకూ గ్రామ ప్రజలకు విజ్ఞప్తి



నార్కట్పల్లి - నవంబర్ 8 (సత్యనిష్ఠ): చెరువు నిండటంతో నందుకూ గ్రామ ప్రజలందరు చూసి సంతోష పడుతున్నారు. కష్టపడి నీళ్లు తెచ్చిన వారికి నా తరఫున అందరికీ ధన్యవాదాలు. చెరువు నింపడం వల్ల భూగర్భ జలాలు పెరిగి రాబోయే రోజుల్లో గ్రామ ప్రజలకు నీటి సరఫరాకు ఇబ్బంది కలుగకుండా తెలంగాణ ప్రభుత్వ అధికారులు చెరువులు నింపే కార్యక్రమం చేశారు. ఈ చెరువును ఎలాంటి ఆగం కాకుండా కాపాడేది గ్రామ ప్రజల బాధ్యత. ఎవరైనా సరే రైతులు చెరువులో నుండి నీళ్లు పెట్టి వ్యవసాయం సాగు చేసే ప్రయత్నం చేయకండి.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు

పేదల సొంత ఇంటి కల నిజంగృహ ప్రవేశాల్లో పాల్గొన్న నేనావత్ బాలు నాయక్



చింతపల్లి-నవంబర్ 8 (సత్యనిష్ఠ): ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు, పేదల సొంత ఇంటి కలను నిజం చేస్తున్న ప్రజా ప్రభుత్వం. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశాల్లో పాల్గొని వాళ్ళ ఇళ్లలోనే దీపావళి సంబరాలు జరుపుకున్న దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్. తెలంగాణ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తుందని అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం నిర్దేశించిన కార్యక్రమాల మేరకు చింతపల్లి మండలం ప్రశాంతపురి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రశాంతపురి 2 తండాలో నూతనంగా నిర్మించిన పలు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బాలు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేద కుటుంబాల్లో కొత్త వెలుగులు నిండుతున్నాయని, ప్రతి లబ్ధిదారుడి ముఖంలో కనిపిస్తున్న ఆనందమే ప్రజా ప్రభుత్వానికి నిజమైన సంతృప్తి అని అన్నారు. ప్రతి పేద కుటుంబం సొంత ఇంటిలో గౌరవంగా జీవించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలు నాయక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జటావత్ హరి నాయక్ తోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ముఖాముఖీకి ఉపాధ్యాయుడు రాజశేఖర్‌కు పిలుపు

- సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడనున్న ఉపాధ్యాయుడు చారుగుండ్ల రాజశేఖర్



కోదాడ-నవంబర్ 9 (సత్యనిష్ఠ): విదేశీ విద్యాబోధన పద్ధతులపై అధ్యయనం చేసిన కోదాడ పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు, సైకాలజిస్ట్ చారుగుండ్ల రాజశేఖర్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డితో జరిగే ముఖాముఖీ సమావేశానికి ఆహ్వానం లభించింది. జపాన్ విజిట్‌లో భాగంగా అక్కడి మాతృభాషా బోధన, సాంకేతికత, జీవన నైపుణ్యాలను పరిశీలించిన ఆయన, తెలంగాణ విద్యాశాఖ ప్రగతికి తగిన సూచనలను ముఖ్యమంత్రికి వివరించనున్నారు. నవంబర్ 14న హైదరాబాద్ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఈ సమావేశం జరగనుంది. రాజశేఖర్‌కు సీఎం ముఖాముఖీ ఆహ్వానం రావడం పట్ల స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్, అవోపా, వర్తక సంఘం, విజయీభవ ట్రస్ట్, ఆర్యవైశ్య సంఘం మరియు ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. నాణ్యమైన విద్య వైపు ఇది మరో ముందడుగు అని ఈ సందర్భంగా రాజశేఖర్ పేర్కొన్నారు.

ఆర్థికంగా వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లు అన్ని కులాల పేదలకు వర్తింపజేయాలి

- కేవలం అగ్రవర్ణాల పేదలకే పరిమితం చేయడం సరికాదు
- అన్యాయం జరుగుతోందన్న జాజుల లింగం గౌడ్



నల్గొండ-నవంబర్ 9 (సత్యనిష్ఠ): ఆర్థికంగా వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లను కేవలం అగ్రవర్ణాల్లోని ఆర్థికంగా వెనుకబడిన పేదలకు మాత్రమే పరిమితం చేయడం సామాజిక న్యాయ సూత్రాలకు విరుద్ధమని వెనుకబడిన తరగతుల సంయుక్త కార్యాచరణ సమితి రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో పేదరికం అనేది ఏ ఒక్క కులానికో, వర్గానికో పరిమితమైన సమస్య కాదని, ప్రతి కులంలోనూ ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద కుటుంబాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాంటప్పుడు కేవలం అగ్రవర్ణాల్లోని పేదలకు మాత్రమే ప్రత్యేకంగా 10 శాతం ఆర్థికంగా వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లు కల్పించడం వల్ల షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతుల వర్గాల్లోని పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. రిజర్వేషన్ల ప్రధాన లక్ష్యం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమేనని, ఆర్థికంగా వెనుకబడిన పేదల సంక్షేమం కూడా ప్రభుత్వ బాధ్యతేనని తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతుల వర్గాల్లోని పేదలకు కూడా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల తరహాలో ఆర్థిక వెనుకబాటుతనాన్ని ప్రాతిపదికగా తీసుకొని అదనపు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కులంతో సంబంధం లేకుండా ఆర్థికంగా వెనుకబడిన ప్రతి పేద కుటుంబానికి విద్య, ఉద్యోగ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ల విధానాన్ని సమీక్షించాలని కోరారు. సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా రిజర్వేషన్ల విధానంలో మార్పులు తీసుకురావాలని జాజుల లింగంగౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు



- దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు
- ముఖ్యమంత్రిని కలిసిన నేనావత్ బాలు నాయక్

దేవరకొండ-నవంబర్ 8 (సత్యనిష్ఠ): హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్, నల్లగొండ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు అలాగే దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంతోష సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ ముఖ్యమంత్రికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజాసేవలో మరింత కాలం కొనసాగుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తన సేవలను అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సర్పంచ్ నూతన గృహప్రవేశ వేడుక

- కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు
- వేడుకలో పాల్గొన్న రామావత్ రవీంద్ర కుమార్



డిండి - నవంబర్ 8 (సత్యనిష్ఠ): డిండి మండలం వావిల్కోల్ గ్రామ సర్పంచ్ పేర్వల జంగారెడ్డి నూతన గృహప్రవేశ వేడుకలో ఆదివారం దేవరకొండ మాజీ శాసనసభ్యులు రామావత్ రవీంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహంలోకి అడుగుపెట్టిన జంగారెడ్డికి, వారి కుటుంబ సభ్యులకు రవీంద్ర కుమార్ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన గృహంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు వెల్లివిరియాలని, ఆ కుటుంబం కలకాలం సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో డిండి మండల భారత రాష్ట్ర సమితి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

గోడ పత్రికలు, కరపత్రాలు విడుదల



గుర్రంపోడు – నవంబర్ 9 (సత్యనిష్ఠ):నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల సమక్షంలో గోడ పత్రికలు, కరపత్రాలను విడుదల చేశారు. నవంబర్ 15 నుండి 18 వరకు నల్గొండ జిల్లా కేంద్రంలో జరగబోయే 36వ అఖిల భారత రైతు సంఘం జాతీయ మహాసభల ప్రాధాన్యతను వివరిస్తూ, నవంబర్ 15న నల్గొండ నాగార్జున ప్రభుత్వ కళాశాల మైదానంలో నిర్వహించబోయే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు జిల్లా నాయకులు మల్లం మహేష్ మాట్లాడుతూ, వీర తెలంగాణ సాయుధ పోరాట గడ్డ అయిన నల్గొండలో ఈ చారిత్రక మహాసభలు జరగడం గర్వకారణమన్నారు. దేశంలో పంటలకు గిట్టుబాటు ధరల కోసం పార్లమెంట్ లో ప్రత్యేక చట్టం తీసుకురావాలని, జిల్లాలో శ్రీశైలం ఎడమ కాలువ సొరంగం పనులను త్వరగా పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. డిండి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించాలని, మూసీ ప్రాజెక్టును ఆధునీకరించాలని కోరారు. అలాగే ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న రైతు భరోసా నిధులను విడుదల చేయాలని, రుణమాఫీ, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు కౌలు రైతులకు న్యాయం చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ ప్రైవేటీకరణను, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ రైతులందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దాదాపు 1500 మంది ప్రతినిధులు పాల్గొనే ఈ మహాసభలను జయప్రదం చేయడానికి విరాళాలు ఇచ్చి సహకరించాలని, నవంబర్ 15న నల్గొండ నాగార్జున ప్రభుత్వ కళాశాలలో జరిగే భారీ బహిరంగ సభలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల కేంద్రం మండల కార్యదర్శి సర్వయ్య, రైతు సంఘం నాయకులు లాలయ్య, రాములు, మల్లయ్య, రవి, స్థానిక రైతు సంఘం ప్రతినిధులు మరియు గ్రామీణ రైతులు తదితరులు పాల్గొన్నారు.

నరకా శూరుడు-తన జాతి కోసం ప్రాణాలర్పించిన మహావీరుడు!

- జై భీమ్ నియోజకవర్గ నేత కంభంపాటి నాగేశ్వరరావు

కోదాడ – నవంబర్ 9 (సత్యనిష్ఠ) ఈ నేలపై మంచితనం, మానవత్వం, సమానత్వం వెల్లివిరిసిన కాలం. మనుషుల మధ్య కులం, మతం, ధనికుడు, పేదవాడు అనే భేదాలు లేకుండా అందరూ సంతోషంగా జీవించాలని కోరుకున్న ఒక రాజ్యం ఉండేదనీ జై భీమ్ కోదాడ నియోజకవర్గ నేత కంభంపాటి నాగేశ్వరరావు అన్నారు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ. ఆ ఒక రాజ్యమే నరకా శూరుడి రాజ్యం, ఆ రాజ్యం లోని ప్రజలు కష్టపడి పని చేసేవారు. భూమిని నమ్ముకొని బతికేవారు. ప్రకృతిని ప్రేమించే వారు. తమ శ్రమతో ఈ దేశానికి అన్నం పెట్టే వారు. వారి జీవితాల్లో ఆత్మ గౌరవం ఉండేది. స్వేచ్ఛ ఉండేది. ఒకరిపై ఒకరికి ప్రేమ ఉండేది. ఆ ప్రజలందరినీ తన కుటుంబంగా భావించిన రాజు నరకా శూరుడు. ఆయనకు రాజ్యం అంటే కేవలం సింహాసనం కాదు. బంగారు కిరీటం కాదు. వేలాది సైనికులు కాదు. తన ప్రజల ముఖాల్లో కనిపించే చిరునవ్వే ఆయనకు నిజమైన రాజ్యం తన ప్రజల్లో ఒక్కరికి కష్టం వచ్చినా ఆయన గుండె తల్లడిల్లేది. ఒక పేదవాడి ఇంట్లో పొయ్యి ఆరిపోయినా రాజ భవనంలో విందు చేయడానికి ఆయన మనసు ఒప్పుకునేది కాదు. అందుకే ఆయన ప్రజలకు ఒక రాజు మాత్రమే కాదు, ఒక రక్షకుడు శత్రువుల దాడి -- తన జాతి కోసం మొదలైన పోరాటం కాలం మారింది, ఆ రాజ్యంపై కన్నేసిన శత్రు బలగాలు దాడికి సిద్ధమయ్యాయి. వారి లక్ష్యం కేవలం రాజ్యాన్ని ఆక్రమించడం కాదు. అక్కడి ప్రజల స్వేచ్ఛను, ఆత్మ గౌరవాన్ని, జీవన విధానాన్ని దెబ్బతీయడం కూడా ఒక అర్ధరాత్రి ఆకాశ మంతా శత్రు సైనికుల కేకలతో మారు మోగింది. వేలాది మంది సైనికులు కత్తులు, తదితర ఆయుధాలతో నరకా శూరుడి రాజ్యంపై విరుచుకు పడ్డారు. ప్రజలు భయంతో వణికి పోయారు. తల్లులు తమ పిల్లలను గుండెలకు హత్తు కున్నారు. వృద్ధులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నారు. చిన్నపిల్లలు ఏడుస్తున్నారు. అప్పుడు నరకా శూరుడు తన ప్రజల ముందుకు వచ్చాడు. ఆయన కళ్లలో భయం లేదు. గుండెల్లో తన ప్రజలపై అపార మైన ప్రేమ మాత్రమే ఉంది. నా ప్రజలారా మీరు భయ పడకండి. మీ ఇళ్లలో దీపాలు ఆర్పకండి. మీ పిల్లల కళ్లలో భయం కనిపించ నివ్వకండి. ఈ నేలపై మీరు స్వేచ్ఛగా జీవించాలి. మీ ఆత్మగౌరవంతో తలెత్తుకొని బతకాలి. మీ ఇళ్లలో వెలిగే ప్రతి దీపాన్ని కాపాడే బాధ్యత నాది. మీ ప్రాణాలు ఉన్నంత వరకు నేను మీతో ఉంటాను. నా ప్రాణం ఉన్నంత వరకు శత్రువులు మిమ్మల్ని



తాకనివ్వను అని తన ప్రజలకు ధైర్యం చెప్పాడు. రక్తంతో రాసిన వీర చరిత్ర ఒక చేతిలో పదునైన కత్తి మరోవైపు తన ప్రజల భవిష్యత్తు నరకా శూరుడు యుద్ధరంగం లోకి దూసుకెళ్లాడు. శత్రువుల కత్తులు ఆయన శరీరాన్ని గాయపరిచాయి. రక్తం ధారలుగా కారింది. అయినా ఆయన అడుగులు వెనక్కి పడలేదు. ఒక గాయం, మరో గాయం శరీరమంతా రక్తంతో తడిసి పోయింది. కానీ ఆయన ఆలోచన ఒక్కటే నా ప్రజలు బతకాలి, నా జాతి నిలబడాలీ, నా ప్రజల ఇళ్లలో దీపాలు వెలగాలి, తన ప్రాణాలను లెక్కచేయకుండా శత్రు సైన్యాన్ని ఎదుర్కొన్నాడు. తన ప్రజలపై దాడి చేయడానికి వచ్చిన బలగాలను ధైర్యంగా అడ్డుకున్నాడు. ప్రతి క్షణం ఆయనకు మరణం దగ్గరవు తున్నా, తన ప్రజలకు మాత్రం జీవించే అవకాశం కల్పించాలని పోరాడాడు. ఆ రాత్రి ఆయనకు తన ప్రాణాల కంటే తన ప్రజల ప్రాణాలే ముఖ్యం. చివరి క్షణం -- ఆరిపోని వేలాది దీపాలు చివరకు వేలాది శత్రువులను ఎదుర్కొంటూ పోరాడిన ఆ మహావీరుడి శరీరం గాయాలతో నిండిపోయింది. చేతి లోని కత్తి బరువెక్కింది. కాళ్లు కదలలేకపోయాయి. రక్తం కోల్పోయిన శరీరం నేలపై కూలిపోయింది. అయినా ఆయన చూపు తన రాజ భవనం వైపు కాదు, తన ప్రజల ఇళ్ల వైపు దూరంగా వేలాది ఇళ్లలో దీపాలు వెలుగు తున్నాయి. ఆ వెలుగులను చూసి ఆయన పెదవులపై చిన్న చిరునవ్వు కనిపించింది. నా ప్రజలు బతికే ఉన్నారు, నా ప్రజల ఇళ్లలో దీపాలు ఆరి పోలేదు, నా పోరాటం వృథా కాలేదు, అని చివరి శ్వాస తీసుకున్నాడని ఈ గాథ చెబుతుంది. ఆయన శరీరం నేల కొరిగింది, కానీ ఆయన కాపాడాలను కున్న ప్రజల ఆశలు నేల కొరగలేదు. ఆయన చేతి లోని కత్తి కింద పడి పోయింది, కానీ ఆయన గుండెల్లో ఉన్న జాతి గౌరవం పడిపోలేదు. ఆయన ప్రాణం విడిచాడు, కానీ ఆయన ప్రజల గుండెల్లో ఒక జ్ఞాపకంగా నిలిచి పోయాడు. దీపావళి -- ఒక త్యాగాన్ని గుర్తుచేసుకునే జ్ఞాపకం, ఆ ప్రజల మౌఖిక సంప్రదాయంలో, నరకా శూరుడి వీరత్వాన్ని గుర్తుచేసుకుంటూ ప్రతి ఇంటిలో దీపాలు వెలిగించే ఆచారం కొనసాగిందని చెబుతారు. ఆ దీపం కేవలం చీకటిని పారద్రోలే వెలుగు మాత్రమే కాదు, ఒక వీరుడి త్యాగానికి గుర్తు. ఒక తల్లి తన బిడ్డను కాపాడు కోవాలనే ఆశకు గుర్తు. ఒక జాతి తన ఆత్మగౌరవాన్ని నిలబెట్టు కోవాలనే సంకల్పానికి గుర్తు. ఒక మనిషి తనకోసం కాకుండా తన ప్రజల కోసం ఎలా జీవించాలో చెప్పే సందేశం. నరకా శూరుడిని కొందరు రాక్షసుడిగా చిత్రీకరించినా, ఈ జానపద గాథలో ఆయన తన ప్రజల కోసం పోరాడిన వీరుడిగా చరిత్రలో గుర్తించ బడుతున్నాడు. చరిత్రలో ఎవరి కథలు రాయబడ్డాయి, ఎవరి కథలు మరుగున పడ్డాయి, ఎవరి వీరత్వం వెలుగులోకి వచ్చింది? ఎవరి త్యాగాలు మరచి పోయాయి, ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకడం మన బాధ్యత, నిజాలు పరిశోధించాలి. మరుగున పడిన ప్రజల చరిత్రను వెలికి తీయాలి. ప్రతి సమాజానికీ తన గతాన్ని తెలుసుకునే హక్కు ఉండాలి. చివరి మాట -- నరకా శూరుడి గాథ మనకు ఇచ్చే సందేశం నరకా శూరుడి పేరుతో చెప్పబడుతున్న ఈ గాథ మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది. రాజు అంటే ప్రజలను పాలించేవాడు మాత్రమే కాదు ప్రజల కష్టాల్లో అండగా నిలిచేవాడు. వీరుడు అంటే వేల మందిని ఓడించే వాడు మాత్రమే కాదు, బలహీనుల ప్రాణాలను కాపాడేవాడు, గొప్పతనం అంటే కిరీటంలో ఉండే బంగారం కాదు, ప్రజల గుండెల్లో ఉండే గౌరవం. మంచితనం -- మానవత్వం -- సమానత్వం! ఇవే ఒక సమాజానికి నిజమైన సంపద. నరకా శూరుడి గాథను గుర్తుచేసుకుంటూ మనం అడగాల్సిన ప్రశ్న ఒక్కటే, తన ప్రజల కోసం ప్రాణాలర్పించిన వీరుడి కథను మన తరువాతి తరాలకు ఎందుకు చెప్ప కూడదు. ఆయన చరిత్రను పరిశోధిద్దాం, ప్రజల గొంతుకను వినిపిద్దాం. ప్రతి సమాజపు గౌరవాన్ని కాపాడుదాం. ఎందుకంటే ఒక వీరుడి శరీరం నేలకొరిగినా, ఆయన ప్రజల కోసం చేసిన త్యాగం తరతరాల జ్ఞాపకాల్లో జీవించగలదు, నేటితరం కొందరి జీవితాల్లో నైనా వెలుగు లాంటి ఆలోచనలు రావాలని కోరుకుంటూ మీ కంభంపాటి నాగేశ్వరరావు, జై మానవత్వం, జై సమానత్వం, జై నా శూద్ర జాతి ఆత్మగౌరవం.

మేకల అభినవ్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

- **వాకర్స్ ఆరోగ్యం, విద్య, క్రీడలు, పరిశుభ్రతకు ప్రాధాన్యత**
- **అధ్యక్షులుగా ఎన్నికైన మునాస కృష్ణయ్య**



అధ్యక్షులు మనస్సు కృష్ణయ్య



జనరల్ సెక్రటరీగా పాలడుగు నాగార్జున



కాటిక వెంకటేశ్వర్లు ట్రెజరర్

నల్గొండ – నవంబర్ 9 (సత్యనిష్ఠ): నల్గొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అసోసియేషన్ లో సుమారు 170 మంది సభ్యులు ఉండగా, వారి భాగస్వామ్యం తో 21 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులుగా మునాస కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా పాలడుగు నాగార్జున, కోశాధికారి గా కాటిక వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా కార్పొరేటర్ అల్లి సుభాష్ యాదవ్, జమాల్, కత్తుల తులసీదాసు, గట్టు కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పంగా నాగరాజు, ముత్యాల సర్వే గౌడ్, తోనుపునూరి ప్రభాకర్ గౌడ్, రాస మల్ల శేఖర్ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా పేరుపి ప్రభాకర్ రావు, కరాకంటి జానయ్య, కత్తుల శివరాజ్, తనిఖీ కమిటీ సభ్యులుగా తెల్ల మేకల శ్రీనివాస్, రావుల కోటేష్, కందుల అశోక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మునాస కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యుల ఆరోగ్య పరిరక్షణతో పాటు విద్య, క్రీడలు, ఆటలు, పాటలు, కలయిక కార్యక్రమాలు, పరిసరాల పరిశుభ్రత వంటి సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. మేకల అభినవ్ స్టేడియం అభివృద్ధికి నూతన కమిటీ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా నడక మార్గం అభివృద్ధి, మంచినీటి సౌకర్యం, వ్యాయామశాల ఏర్పాటు, వాకర్స్ కు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమస్యలను జిల్లా కలెక్టర్ తో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాకర్స్ అందరికీ మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్టేడియాన్ని కేవలం వాకింగ్ కే పరిమితం చేయకుండా ఆరోగ్యం, ఆహ్లాదం, ఐక్యత, సామాజిక చైతన్యానికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతామని వారు వెల్లడించారు.

అఖిల భారత రైతు సంఘం జాతీయ మహాసభలు ఈ నెల 15న బహిరంగ సభను జయప్రదం చేయండి

పిలుపునిచ్చిన కొండమడుగు నర్సింహ్మ



పోచంపల్లి – నవంబర్ 9 (సత్యనిష్ఠ): ఈ నెల 15 నుండి 18 వరకు విప్లవాల పురిటిగడ్డ నల్గొండ జిల్లా కేంద్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభల సందర్భంగా 15వ తేదీన నిర్వహిస్తున్న బహిరంగ సభలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ పిలుపునిచ్చారు. సోమవారం పోచంపల్లి భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు కార్యాలయంలో పట్టణ కమిటీ సభ్యులు వడ్డేపల్లి యాదగిరి అధ్యక్షతన జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు పోచంపల్లి పట్టణ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా నర్సింహ్మ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు కార్పొరేట్ శక్తుల లాభాల గురించి ఆలోచిస్తున్నారు తప్ప రైతుల బాధలు మాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పెట్టుబడికి అదనంగా 50 శాతం కలిపి అన్ని పంటలకు కనీస మద్దతు ధర కల్పించేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులు, కౌలు రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ వర్తింపజేయాలని సూచించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసే విధానాలను నిలిపివేయాలి, బలవంతపు భూసేకరణను అరికట్టాలని అన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందిస్తూ, ప్రభుత్వ సాయం మరియు రాయితీలు నేరుగా వారికే అందేలా చట్టభద్రత కల్పించాలని కోరారు. వ్యవసాయ కూలీలను ఆదుకునేందుకు గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేసి బడ్జెట్ కేటాయింపులను పెంచాలి, వ్యవసాయ రంగాన్ని ప్రైవేటీకరించే విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకుని, రైతులకు ఉచిత విద్యుత్ సరఫరాను కొనసాగించాలని డిమాండ్ చేశారు. రైతాంగ ఉద్యమాలకు పురిటిగడ్డ అయిన నల్గొండ జిల్లాలో 90 ఏళ్ల రైతు సంఘం ప్రస్థానంలో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 80వ వార్షికోత్సవాల నేపథ్యంలో ఈ మహాసభలు జరగడం చారిత్రాత్మకమని కొండమడుగు నర్సింహ్మ కొనియాడారు. ఇలాంటి నేపథ్యంలో మహాసభలను, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు జిల్లా కమిటీ సభ్యులు కోట రామచంద్రారెడ్డి, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, కమిటీ సభ్యులు బుగ్గ లక్ష్మయ్య, పొన్నమోని కృష్ణ, బేతి కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కర్షక ఐక్యతను బలోపేతం చేద్దాంనవంబర్ 15 బహిరంగ సభలో కార్మిక వర్గం పాల్గొనాలి

పిలుపునిచ్చిన తుమ్మల వీరారెడ్డి



నల్గొండ – నవంబర్ 9 (సత్యనిష్ఠ): అఖిల భారత రైతు సంఘం జాతీయ 36వ మహాసభల సందర్భంగా నవంబర్ 15న జరుగు బహిరంగ సభలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని కార్మిక కర్షక మైత్రిని కొనసాగించాలని భారత కార్మిక సంఘాల కేంద్రం రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి సలీం పిలుపునిచ్చారు. సోమవారం భారత కార్మిక సంఘాల కేంద్రం నల్గొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నవంబర్ 15 బహిరంగ సభను జయప్రదం చేయాలని ముద్రించిన కరపత్రాన్ని భారత కార్మిక సంఘాల కేంద్రం కార్యాలయంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అఖిల భారత రైతు సంఘం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. ఐక్య ఉద్యమాలలో కీలక భూమిక పోషిస్తున్న సుదీర్ఘ పోరాటాల చరిత్ర కలిగిన అఖిల భారత రైతు సంఘం జాతీయ మహాసభలు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన ఉద్యమాల పురిటిగడ్డ నల్గొండలో నవంబర్ 15 నుంచి 18 వరకు జరుగుతున్నాయని వారు తెలిపారు. ఈ మహాసభల ప్రారంభ రోజు నవంబర్ 15న నాగార్జున ప్రభుత్వ కళాశాల మైదానంలో బహిరంగ సభ జరుగుతుందని, ఆ బహిరంగ సభకు జిల్లాలోని కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభల సందేశాన్ని గ్రామ గ్రామాలకు, పారిశ్రామిక ప్రాంతాలకు తీసుకువెళ్లాలని వారు పేర్కొన్నారు. కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల వలన దేశంలోని రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆరోపించారు. పండించిన పంటకు కనీస న్యాయమైన మద్దతు ధర లభించకపోవడం వలన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, మోడీ నాయకత్వంలోని కేంద్ర భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అమెరికా తదితర సామ్రాజ్యవాద దేశాల ఒత్తిడికి తలొగ్గి చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల వ్యవసాయం కుదేలైందని అన్నారు. కార్పొరేట్ కంపెనీల లాభాలు, వారి ప్రయోజనాల కోసం కార్మిక సంస్కరణ పేరుతో పోరాడి త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక నియమావళిని తీసుకువచ్చి కార్మికులను బానిసలుగా మార్చేస్తున్నారని ఆరోపించారు. రైతాంగం, కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు రెండు వేరువేరుగా కనిపించినప్పటికీ వాటి వెనుక ఉన్నది మాత్రం నయా ఉదారవాద ఆర్థిక విధానాలే, వాటి దోపిడీ స్వభావం మాత్రం ఒకటే, వాటిని ఎదుర్కొనేందుకు కార్మికులు, రైతులు ఐక్యంగా ఉద్యమించినప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. హక్కులు కాపాడుకోవడానికి అయినా కార్మిక వర్గ ఐక్యతతో మరింత పోరాటాలు ఉధృతం చేయడానికి కోసం రైతు మహాసభలకు కార్మిక వర్గం తమ శక్తిని ప్రదర్శించాల్సిన బాధ్యత ఉందని, అందుకే 15న జరిగే బహిరంగ సభలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఆవాజ్ జిల్లా కార్యదర్శి సైదా సయ్యద్ హశం, సీనియర్ నాయకులు ఊట్కూరి నారాయణరెడ్డి, భారత కార్మిక సంఘాల కేంద్రం జిల్లా ఉపాధ్యక్షులు డబ్బికార్ మల్లేష్, లకపాక రాజు, దండెంపల్లి సత్తయ్య, నల్గొండ పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.